# నియోజకవర్గానికో నర్సింగ్ కళాశాల



పరిగి వంద పడకల ఆసుపత్రి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి దామోదర రాజనర్సింహ, పక్కన స్పీకర్ ప్రసాద్‌కుమార్ తదితరులు

- రాష్ట్రంలో కొత్తగా 8 మెడికల్ కళాశాలలు, 16 నర్సింగ్ కళాశాలల ఏర్పాటు
- అదనంగా 400 ఎంబీబీఎస్ సీట్లు పెంపు
- మొదటి విడతలో 100 ట్రామా కేర్ సెంటర్‌లు
- నాలుగు క్యాన్సర్ రీజినల్ సెంటర్‌లు ఏర్పాటు
- రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖల మంత్రి దామోదర రాజనర్సింహ

పరిగి, మే 12 : ప్రతి నియోజకవర్గంలో ఒక నర్సింగ్ కళాశాల ఏర్పాటు చేయాలని ప్రభుత్వం యోచిస్తున్నదని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖల మంత్రి దామోదర రాజనర్సింహ వెల్లడించారు. సోమవారం పరిగిలో రూ.27కోట్లతో చేపట్టనున్న వంద పడకల ఆసుపత్రి భవనం నిర్మాణానికి స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, మండలిలో చీఫ్ విప్ మహేందర్‌రెడ్డి, చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, పరిగి, తాండూరు ఎమ్మెల్యేలు రాంమోహన్‌రెడ్డి, మనోహర్‌రెడ్డిలతో కలిసి మంత్రి శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత 8 కొత్త మెడికల్ కాలేజీలు, 400 ఎంబీబీఎస్ అదనపు సీట్లు, 16 నర్సింగ్ కాలేజీలు ఏర్పాటు చేసిందన్నారు. రాష్ట్రంలో నాలుగు క్యాన్సర్ రీజినల్ సెంటర్‌లు ఏర్పాటు చేయాలని సర్కారు నిర్ణయించిందన్నారు. పరిగిలోని 30 పడకల ఆసుపత్రిని వంద పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేయడంతో ఏరియా ఆసుపత్రి స్థాయికి వస్తుందన్నారు. పరిగి ఆసుపత్రిలో గల డయాలసిస్ సెంటర్‌లో మరో 5 బెడ్స్ పెంచడం జరుగుతుందని మంత్రి హామీ ఇచ్చారు. చౌడాపూర్‌లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేస్తామన్నారు. రాష్ట్రంలో మొదటి విడతలో సామాన్యుడు హైదరాబాద్‌కు వెళ్లకుండా జిల్లా కేంద్రంలో ఎంఆర్‌ఐ ఏర్పాటు చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. నాన్ కమ్యునకేబుల్ డిసీజెస్ అయిన బీపీ, మధుమేహం, క్యాన్సర్‌లకు సంబంధించి ప్రతి సంవత్సరం ప్రతి కుటుంబానికి స్క్రీనింగ్ చేసేందుకు ప్రతి జిల్లాకు ఒక క్యాన్సర్ స్క్రీనింగ్ మొబైల్ క్లినిక్ ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి తెలిపారు. ప్రమాదాలు జరిగినపుడు అంబులెన్స్‌ల రెస్పాన్స్ టైం 19 నుంచి 14 నిమిషాలకు తగ్గిందని, ఇంకా 10 నిమిషాలకు తగ్గాలని, అందుకుఅంబులెన్స్‌ల సంఖ్య పెంచడం జరుగుతుందని తెలిపారు.

### నర్సింగ్ కళాశాల మంజూరు చేయాలి

పరిగి ఎమ్మెల్యే రాంమోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. పరిగి ప్రాంతంలో నాణ్యమైన వైద్య సేవలుండాలనే ఉద్దేశంతో మంత్రి దృష్టికి తీసుకువెళ్లగా.. రూ.27కోట్లతో వంద పడకల ఆసుపత్రి భవన నిర్మాణం చేపట్టడం జరుగుతుందని తెలిపారు. మెడికల్ కాలేజీలను ఆసుపత్రులకు అనుసంధానం చేసి అక్కడ పనిచేసే ప్రొఫెసర్లను తీసుకువచ్చి ఆసుపత్రులలో వైద్యం చేయడానికి రూరల్ హెల్త్ సెంటర్ కింద పెట్టాలని.. పరిగికి నర్సింగ్ కళాశాల మంజూరు చేయాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో వైశ్య ఫెడరేషన్ చైర్‌పర్సన్ సుజాత, కలెక్టర్ ప్రతీక్‌జైన్, ఎస్పీ నారాయణ రెడ్డి, ఆర్డీవో వాసుచంద్ర, డీఎంఅండ్‌హెచ్‌వో వెంకటరమణ, డీసీహెచ్‌వో ఆనంద్, గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ రాజేశ్వర్‌రెడ్డి, పరిగి, కులకచర్ల మార్కెట్ కమిటీల చైర్మన్‌లు, అధికారులు పాల్గొన్నారు.

## వైద్యాధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలి

వికారాబాద్ : వైద్యాధికారులు బాధ్యతాయుతంగా, సేవా దృక్పథంతో పని చేయాలని మంత్రి దామోదర రాజనరసింహ అన్నారు. వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని రాజీవ్‌నగర్ కాలనీ సమీపంలో రూ.30 కోట్ల నిధుల వ్యయంతో నిర్మించిన 300 పడకల సౌకర్యంతో కూడిన ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, ప్రభుత్వ చీఫ్ విప్ మహేందర్‌రెడ్డి, పార్లమెంటు సభ్యుడు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, శాసనసభ్యులు రామ్మోహన్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి, కలెక్టర్ ప్రతీక్‌జైన్‌లతో కలిసి మంత్రి ప్రారంభించారు. నూతనంగా నిర్మించిన దవాఖాన గదులను పరిశీలించారు. వైద్యాధికారులను అడిగి పలు విషయాలు తెలుసుకున్నారు. అనంతరం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో స్పీకర్, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులతో కలిసి ప్రభుత్వ ఆసుపత్రులు, వైద్య కళాశాల నిర్వహణ, మౌలిక సదుపాయాలు, బ్లడ్ బ్యాంక్, వైద్యుల విధుల నిర్వహణ తదితర అంశాలపై వైద్యాధికారులతో మంత్రి సమీక్షించారు. ప్రమాదాలు సంభవించిన క్రమంలో సత్వర వైద్య సేవలు అందించేందుకు ఒక్కో ట్రామా సెంటర్‌కు రూ.5.5 కోట్ల నిధులను కేటాయించడం జరుగుతుందని మంత్రి తెలిపారు. కార్యక్రమంలో డీఎంఈ డాక్టర్ నరేంద్రకుమార్, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ కమిషనర్ అజయ్ కుమార్, అదనపు కలెక్టర్లు లింగ్యానాయక్, సుధీర్, ఆర్డీవో వాసుచంద్ర, జిల్లా వైద్యా ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ, ప్రభుత్వ దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ రామచంద్రయ్య, గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ రాజేశ్వర్‌రెడ్డి ఉన్నారు.



ప్రభుత్వ దవాఖాన ప్రారంభోత్సవ సమావేశానికి హాజరైన వైద్యాధికారులు

# అపరిష్కృతంగా ఉన్న సమస్యలను పరిష్కరించాలి

### ప్రజావాణిలో అర్జీలను స్వీకరించిన వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్



ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

వికారాబాద్, మే 12 : జిల్లాలో అపరిష్కృతంగా ఉన్న ప్రజా సమస్యలను పరిష్కరించే దిశగా అధికారులు కృషి చేయాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్ తెలిపారు. సోమవారం ప్రజావాణి సందర్భంగా అదనపు కలెక్టర్లు లింగ్యానాయక్, సుధీర్, డీఆర్‌డీవో శ్రీనివాస్, ఆర్డీవో వాసు చంద్రలతో కలిసి కలెక్టర్ ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ప్రజా సమస్యలపై అధికారులు దృష్టి సారించాలన్నారు. జిల్లా అధికారులు సమాచారం ఇవ్వకుండా ప్రజావాణికి గైర్హాజర్ కాకూడదని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రజావాణిలో 68 అర్జీలు రాగా ఎక్కువ శాతం భూ సమస్యలు, పెన్షన్లు, హౌసింగ్, వ్యవసాయ రంగానికి సంబంధించిన దరఖాస్తులు వచ్చాయి. ప్రజావాణిలో జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

### ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలి

**ఆదిబట్ల :** ప్రజావాణి ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ అన్నారు. రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన ప్రజావాణిలో జిల్లా రెవెన్యూ అధికారి సంగీతతో కలిసి ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజావాణిలో ప్రజలు అందించే వినతులను సంబంధిత శాఖల జిల్లా అధికారులు తక్షణమే స్పందిస్తూ వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజావాణిలో రెవెన్యూ శాఖ–21, ఇతర శాఖలకు సంబంధించి 25 మొత్తం 46 దరఖాస్తులు అందాయని ఆమె తెలిపారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులతోపాటు మున్సిపల్ అధికారులు, తహసీల్దార్‌లు పాల్గొన్నారు.



ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ తదితరులు

# ప్రజలపై దైవానుగ్రహం ఉండాలి

### సబితా ఇంద్రారెడ్డి

కందుకూరు, మే 12 : రాష్ట్ర ప్రజలపై దైవానుగ్రహం ఉండాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి తెలిపారు. మండల పరిధిలోని కొలనుగూడలో జరుగుతున్న బీరప్ప జాతరలో ఆమె పాల్గొన్నారు. ఆమెకు నిర్వాహకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆమె బీరప్ప ఆలయంలో బీరప్ప కామరాతి కల్యాణంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. భగవంతుని కృప అందరిపై ఉండాలని తెలిపారు. జాతరను అందరూ సమష్టిగా నిర్వహించుకోవడంపై ఆనందం వ్యక్తం చేశారు. గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానన్నారు.



బీరప్ప దేవాలయంలో జరిగిన ప్రత్యేక పూజల్లో మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి తదితరులు

కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు క్యామ మల్లేశ్, మాజీ సర్పంచులు, మార్కెట్ మాజీ చైర్మన్ సురేందర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ చంద్రశేఖర్ తదితరులున్నారు



ఏర్పుమళ్ల నుంచి సీల్యానాయక్‌తండాకు వెళ్లే రహదారిపై విరిగిపడ్డ మర్రిచెట్టు

# గాలివాన బీభత్సం

### విరిగిపడిన చెట్లు.. నేలకొరిగిన స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు..
### రాకపోకలకు ఇబ్బందులు.. విద్యుత్ సరఫరాలో అంతరాయం

బొంరాస్‌పేట్, మే 12 : మండల పరిధిలోని ఏర్పుమళ్ల గ్రామంలో ఆదివారం రాత్రి ఉరుములు మెరుపులతో కూడిన గాలివాన బీభత్సం సృష్టించింది. గాలివానకు ఏర్పుమళ్ల నుంచి సీల్యానాయక్‌తండాకు వెళ్లే రహదారిపై మర్రిచెట్టు విరిగిపడడంతో తండాకు వెళ్లే దారి పూర్తిగా మూసుకుపోయింది. గత 24 గంటలుగా తామ తండాకు వెళ్లేందుకు దారి లేక పంటపొలాల మీదుగా ప్రయాణం చేస్తున్నామని అధికారులు స్పందించి చెట్టును తొలగించి రహదారిపై రాకపోకలను పునరుద్ధరించాలని తండా ప్రజలు కోరారు. మామిడి, వరి పంటలు దెబ్బతిన్నాయి.


### చౌదరిగూడలో..

**కొందుర్గు :** చౌదరిగూడ మండలంలో సోమవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. పెద్దఎత్తున ఈదురుగాలులు వీచడంతో విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్ నేలకొరగగా రహదారులకు ఇరువైపులా ఉన్న చెట్లు విరిగిపడ్డాయి. విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది.



చౌదరిగూడ గ్రామంలో నేలకొరిగిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

# గోవులను అక్రమంగా తరలిస్తే ఊరుకోం



అక్రమంగా తరలించేందుకు సిద్ధంగా ఉన్న గోవులు

కులకచర్ల, మే 12 : గోవులను అక్రమంగా తరలించి గోవధ చేస్తే చూస్తూ ఊరుకోబోమని పలువురు హిందూ సంఘాల సభ్యులు పేర్కొన్నారు. సోమవారం కులకచర్ల మండలం బండవెల్కిచర్లలో అక్రమంగా హైదరాబాద్‌కు తరలించేందుకు సిద్ధంగా ఉంచిన ఆవులను హిందూ సంఘాలు పట్టుకున్నాయి. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బండవెల్కిచర్లకు చెందిన మోహన్ గ్రామంలో అవులను కాస్తున్నాడు. మోహన్ కాస్తున్న ఆవులు ప్రతిరోజూ తగ్గుతుండటంతో అనుమానమొచ్చిన గ్రామస్తులు, హిందూ సంఘాలు, గోరక్షణ కమిటీ సభ్యులు బండవెల్కిచర్లకు చేరుకొని ఆవులు ఎవరివి, ఎక్కడి నుంచి తీసుకువస్తున్నారు. ఎక్కడికి తరలిస్తున్నారని మోహన్‌ను ప్రశ్నించారు. గోవులు తనవి కావని, హైదరాబాద్‌కు చెందిన ఖాసీమ్‌కు సంబంధించినవని, తనకు పశువులను కాయడానికి వేతనం ఇస్తున్నాడని తెలుపగా వెంటనే స్థానికులు కులకచర్ల పోలీసులకు సమాచారమివ్వగా అక్కడికి వెళ్లి వివరాలు తెలుసుకొని ఆవులను కరణ్ కోట్ గోశాలకు తరలించారు. ఈ విషయాన్ని బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి హన్మంతు కులకచర్ల పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### గోవులను వధిస్తున్నవారిపై చర్యలు తీసుకోవాలి

గోవులను వధిస్తున్నవారిపై, వధించడానికి కారకులవుతున్నవారిపై చర్యలు తీసుకొని.. వారిపై కేసులు నమోదు చేసి అరెస్టు చేయాలని పలువురు హిందూసంఘాల నాయకులు పేర్కొన్నారు. గోవధ చేయడం వలన గ్రామాల్లో నేడు గోవులు కనుమరుగవుతున్నాయని తెలిపారు. గోవధ నిషేధం అని తెలిసినా కొంతమంది దీన్ని ఉల్లంఘిస్తున్నారని పేర్కొన్నారు. సంఘటన స్థలాన్ని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కరణం ప్రహ్లాద్‌రావుతోపాటు నాయకులు పరిశీలించారు.

# ఆశ్రమ పాఠశాలలో అడ్మిషన్లు ప్రారంభం

మలక్‌పేట, మే 12 : మలక్‌పేట నల్గొండ చౌరస్తాలోని దివ్యాంగుల సంక్షేమ శాఖ కార్యాలయం ఆవరణలోని ప్రభుత్వ బధిరుల బాలుర ఆశ్రమ పాఠశాలలో 2025–2026 విద్యాసంవత్సరానికి గాను అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని పాఠశాల ప్రిన్సిపాల్ నాగలక్ష్మి తెలిపారు. సోమవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. పాఠశాలలో ఒకటి నుంచి 10వ తరగతి వరకు అడ్మిషన్లు తీసుకోవడం జరుగుతుందన్నారు. రాష్ట్రంలోని 33 జిల్లాల నుంచి విద్యార్థులు ఈ పాఠశాలలో అడ్మిషన్లు పొందవచ్చని, విద్యార్థులు సదరం సర్టిఫికెట్, ఆధార్‌కార్డు, జనన ధ్రువీకరణ పత్రం, టీసీ, మూడు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు తీసుకొని రావాలన్నారు. పాఠశాలలో అడ్మిషన్లు పొందిన విద్యార్థులకు విద్యాబోధనతో పాటు ఉచిత భోజనం, హాస్టల్ వసతి, యూనిఫామ్ లు, కాస్మెటిక్ చార్జీలు ఇవ్వబడతాయని పేర్కొన్నారు. ప్రతి విద్యార్థికి కాస్మెటిక్స్ చార్జీల కింద నెలకు రూ.250 ఇవ్వబడతాయని వివరించారు . పాఠశాల పని దినాల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు అడ్మిషన్లు తీసుకోబడతాయని తెలిపారు. ఇతర వివరాలకు 7674933347, 9000221301లను సంప్రదించాలని సూచించారు.

### నూటికి నూరు శాతం ఉత్తీర్ణత

2024– 2025 విద్యాసంవత్సరానికి గాను ఇటీవల ప్రకటించిన పదో తరగతి పరీక్షా ఫలితాల్లో పాఠశాలలోని 23 మంది విద్యార్థులకుగాను 15 మంది ఫస్ట్ క్లాస్‌లో, 8 మంది విద్యార్థులు సెకండ్ క్లాస్‌లో పాస్ అయ్యారని ఆమె తెలిపారు. జిల్లాలో నూటికి నూరు శాతం ఉత్తీర్ణత ను సాధించిన మొదటి పాఠశాలగా గుర్తింపు లభించిందని ఆమె పేర్కొన్నారు.

# సాగులో పంట మార్పిడి తప్పనిసరి

- ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు రజినీకాంత్‌రెడ్డి, అరుణశ్రీ
- మేడిపల్లిలో 'రైతుల ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమం



రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు

యాచారం, మే 12 : ఒకే పంటపై ఆధారపడకుండా సాగులో పంట మార్పిడి చేపడితే దిగుబడితోపాటు అధిక లాభాలను పొందవచ్చని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు రజినీకాంత్‌రెడ్డి, అరుణశ్రీ అన్నారు. మండలంలోని మేడిపల్లి గ్రామంలో రైతుల ముంగిట్లో శాస్త్రవేత్తలు అనే కార్యక్రమాన్ని వ్యవసాయ శాఖ, ప్రొఫెసర్ జయశంకర్ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు సంయుక్తంగా సోమవారం నిర్వహించారు. రైతులకు ఎరువుల వాడకం, ఎరువుల ప్రయోజనాలు, దుష్ప్రభావాల గురించి చర్చించారు. పురుగుల మందుల వినియోగంపై అవగాహన కల్పించారు.

నీటి ప్రాముఖ్యత, నీటి వినియోగ సమర్థత, వరిపంటలో పంట వైవిధ్యీకరణ, వాతావరణ పరిరక్షణకు మొక్కల పెంపకం ఎలా ఉపయోగపడుతుందనే అంశాలపై శాస్త్రీయంగా విపులంగా వివరించారు. పంట మార్పిడి పద్ధతులతో సుస్థిర ఆదాయాన్ని పొందవచ్చని తెలిపారు. పంట అవసరానికి మాత్రమే రసాయనాలను ఉపయోగించి నేల తల్లి ఆరోగ్యాన్ని కాపాడాలని వారు రైతులకు సూచించారు. విత్తన రశీదులను దాచిపెట్టుకోవడంతో కష్టకాలంలో తగిన నష్ట పరిహారాన్ని పొందవచ్చని పేర్కొన్నారు. సాగునీటిని ఆదా చేయడంతో భావితరాలను ఆదుకోవడం జరుగుతుందని తెలిపారు. చెట్లను విరివిగా పెంచి పర్యావరణాన్ని కాపాడటంలో రైతులు తమ పాత్రను పోషించాలన్నారు.

నకిలీ విత్తనాలపై రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వేసవి దుక్కులు దున్నేటప్పుడు రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఫార్మర్ రిజిస్ట్రీ (రైతు నమోదు) కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్‌కార్డు, ఆధార్‌కార్డుకు లింక్ ఉన్న ఫోన్ నంబర్‌ను రైతు వేదికలో అందజేసి తమ వివరాలను రిజిస్ట్రేషన్ చేసుకోవాలని వారు సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి రవినాథ్, పీఏసీఎస్ డైరెక్టర్ స్వరూప, వ్యవసాయ విస్తరణ అధికారులు పాల్గొన్నారు.

### రావిర్యాలలో..

**కొందుర్గు :** చౌదరిగూడ మండలంలోని రావిర్యాల గ్రామంలో ఏర్పాటు చేసిన 'రైతుల ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమంలో ప్రొఫెసర్ జయశంకర్ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్లు, శాస్త్రవేత్తలు పాల్గొని రైతులకు పలు సూచనలు, సలహాలు అందజేశారు. రైతులు తక్కువ నీటితో అధిక పంటలు పండించడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. రసాయన ఎరువుల వాడకాన్ని పూర్తిగా తగ్గించి భూసారాన్ని కాపాడుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏవో రాజేందర్‌రెడ్డి, ఏఈవో సోనిశ్రీ పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న శాస్త్రవేత్తలు, అధికారులు, రైతులు

# ఇద్దరు నిందితులకు జీవిత ఖైదు

యాలాల, మే 12 : యాలాల మండల పరిధిలో బుగ్గప్పను గతంలో కిరాతకంగా నరికి చంపిన కేసులో నిందితులకు సోమవారం ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ కోర్టు జీవిత ఖైదు విధించింది. ఎస్పీ నారాయణ రెడ్డి కథనం ప్రకారం.. కొడంగల్ మండలం ఎర్రన్‌పల్లికి చెందిన సస్పెక్ట్ బుగ్గప్ప అదే గ్రామానికి చెందిన రాములుగౌడ్‌ను చంపుతానని బెదిరించాడని ఫిర్యాదు వచ్చింది. 2015 ఏప్రిల్ 4న కొడంగల్ ఎస్‌ఐ ఆదేశానుసారం కానిస్టేబుల్ హరిలాల్ ఎర్రన్‌పల్లికి వెళ్లి గ్రామపంచాయితీ వద్ద ఉన్న రాములుగౌడ్, తమ్ముడు లక్ష్మయ్యగౌడ్, ఉప సర్పంచ్ నర్సప్పతోపాటు మరికొందరిని బుగ్గప్ప గురించి ఆరా తీశారు. హరిలాల్ దర్గా వద్దకు వెళ్లి బుగ్గప్పతో రాములుగౌడ్ ఫిర్యాదు చేశాడని చెప్పి కొడంగల్ పోలీస్‌స్టేషన్‌కు తన బైక్‌పై కూర్చోబెట్టుకొని తీసుకువెళ్తున్నారు. జుంటుపల్లి గేటు దాటిన తర్వాత మధ్యాహ్నం 3.30 సమయంలో రాములుగౌడ్, తమ్ముడు లక్ష్మయ్యగౌడ్, ఉప సర్పంచ్ నర్సప్పలతోపాటు మరో ఇద్దరు వాహనాలపై వచ్చి హరిలాల్‌ను అడ్డుకున్నారు. హరిలాల్ బైకును కొద్దిగా ఆపగానే వెంటనే వారందరూ బుగ్గప్పపై దాడి చేయడంతో హరిలాల్ విడిపించే ప్రయత్నం చేశారు. రాములుగౌడ్, లక్ష్మయ్యగౌడ్ వేట కొడవలితో బుగ్గప్పపై విచక్షణారహితంగా దాడి చేశారు. మిగిలినవారు కూడా వారికి సహకరించడంతో బుగ్గప్ప అక్కడికక్కడే మరణించాడు. నిందితులు బైక్‌లపై ఎర్రన్‌పల్లి వైపు పారిపోయారు.

ఎస్‌ఐకి జరిగిన విషయాన్ని హరిలాల్ ఫోన్ ద్వారా తెలియజేశారు. నిందితులను చూస్తే గుర్తుపడతానని యాలాల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అప్పటి యాలాల ఎస్‌ఐ రవికుమార్ 52/2015, U/sec 302, 353 R/w 34 IPS సెక్షన్‌ల కింద కేసు నమోదు చేశారు. అప్పటి కరణ్‌కోట్ సీఐ శివశంకర్ దర్యాప్తు చేసి కోర్టులో చార్జ్ షీట్ దాఖలు చేశారు. వాదోపవాదాలు విన్న ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ కోర్టు జడ్జి శ్రీనివాస్‌రెడ్డి నిందితులు ఏ1 రాములుగౌడ్, ఏ2 ఈడిగి లక్ష్మయ్యగౌడ్‌లకు జీవిత ఖైదు, ఒక్కొక్కరికి రూ.1000 జరిమానా విధించారు.

# అమర జవాన్లకు ఘన నివాళి




**హయత్‌నగర్ :** హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ నాగరాజ్‌గౌడ్, వనస్థలిపురం ట్రాఫిక్ ఆర్‌ఐ శ్రీశైలంయాదవ్ ఆధ్వర్యంలో సోమవారం హయత్‌నగర్ మండల కార్యాలయం నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు భారీ ఎత్తున ర్యాలీ నిర్వహించారు.




**శంషాబాద్ రూరల్ :** అమర జవాన్లకు తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ రంగారెడ్డి జిల్లా కమిటీ ఘనంగా నివాళులర్పించింది. శంషాబాద్‌లో జర్నలిస్టులు పెద్దఎత్తున ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ విగ్రహం వద్ద జవాన్ మురళీనాయక్‌కు శ్రద్ధాంజలి ఘటించారు. రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి సైదులు జాతీయ కౌన్సిల్ సభ్యుడు దేవేందర్ తదితరులున్నారు.